సాక్షి జగిత్యాల

బుధవారం ￨ 4 ￨ డిసెంబర్ ￨ 2024



కొండగట్టులో ప్రజావిజయోత్సవం

కొండగట్టు(చొప్పదండి): ప్రజా విజయోత్సవాల సదర్భంగా కొండగట్టు అంజన్న ఆలయాన్ని దీపాలతో అలంకరించారు. సహస్ర నామార్చన, అభిషేకం, వేదపారాయణం నిర్వహించారు.



ఆకట్టుకున్న ప్రదర్శనలు

జగిత్యాల: ప్రజా విజయోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కళాసారధి కళాకారుల బృందం ఆటపాటలతో అలరించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/20.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. చలిగాలులు కొనసాగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మహిళలకు 'భరోసా'



భరోసా సెంటర్‌లో మాట్లాడుతున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: బాధిత మహిళలు, చిన్న పిల్లలకు భరోసా కేంద్రం ద్వారా సత్వర సేవలు అందుతున్నాయని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. న్యాయ సలహాలు, సైకలాజికల్ కౌన్సెలింగ్, వైద్యపరంగా తీసుకుంటున్న చర్యలు, మహిళల వేధింపులపై నమోదు అవుతున్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌శాఖ మహిళల రక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, మహిళలకు ఆపద వచ్చిన వెంటనే స్పందిస్తోందన్నారు. పోక్సో, అత్యాచార కేసుల్లో బాధితులకు త్వరగా పరిహారం ఇప్పించడానికి వివిధ శాఖల అధికారులు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట సీసీ రంజిత్‌రెడ్డి, భరోసా సిబ్బంది ఉన్నారు.

కొండగట్టు ఆలయ అర్చకునికి మెమో జారీ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయ అర్చకుడికి మంగళవారం ఆలయ అధికారులు మెమోజారీ చేశారు. అర్చకుడు నాలుగు రోజుల క్రితం దర్శనం నిమిత్తం వచ్చిన భక్తులు, ఆలయంలో అష్టోత్తర టికెట్ తీసుకునే క్రమంలో టికెట్ వద్దంటూ భక్తుల నుంచి డబ్బులు తీసుకున్నాడు. ఆలయ ఆదాయానికి గండికొట్టేలా వ్యవహరించారని ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు పోచమల్ల ప్రవీణ్ కుమార్ ఆలయ ఈవోకు ఫిర్యాదు చేశారు. ఆయన సీసీ కెమెరాలను పరిశీలించి అర్చకుడికి మెమో జారీ చేశారు.

ధర్మపురిలో కుజదోష నివారణ పూజలు



కుజదోష నివారణ పూజలు చేస్తున్న భక్తులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో మంగళవారం కుజదోష నివారణ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రోచ్చరణల మధ్య కుటుంబ కలహాలు, వాస్తు దోషాలు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నవారికి కుజదోష నివారణ పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లో మొక్కులు చెల్లించారు.

అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీధర్



శ్రీధర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

జగిత్యాల: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గంగుల శ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం వివేకానంద స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీధర్‌ను ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎలేటి ముత్తయ్యరెడ్డి, అంజయ్య, రాందాస్, రమేశ్, జ్యోతి, కొమురయ్య పాల్గొన్నారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని శ్రీధర్ తెలిపారు.

గ్రామసభను బహిష్కరించిన భూ నిర్వాసితులు



గ్రామసభలో రైతులు

మేడిపల్లి: సూరమ్మ చెరువు కుడి కాలువ నిర్మాణం కోసం భీమారం మండలం గోవిందారంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన గ్రామసభను రైతులు బహిష్కరించారు. ప్రభుత్వం ఇస్తున్న పరిహారం సరిపోదని, భూములు కోల్పోతున్న వారంతా సన్న, చిన్నకారు రైతులేనని, భూములు ఇవ్వడం కుదరదని ఏకగ్రీవ తీర్మానం చేసి రెవెన్యూ అధికారులకు అందించారు. అంతకుముందు రంగాపూర్ వరద కాలువ నుంచి ఎత్తిపోతల ద్వారా సాగునీరు ఇవ్వాలని కోరారు.

6, 7న జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్

జగిత్యాల: ఈ నెల 6, 7 తేదీల్లో జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు డీఈవో రాము తెలిపారు. జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డ్స్‌ను జిల్లాకేంద్రంలోని ఓల్డ్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ప్రదర్శనలకు అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

అనుబంధమా.. నువ్వెక్కడ?

జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వేంపల్లికి చెందిన వెల్మల రమేశ్‌కు రాయికల్ మండలం అల్లీపూర్‌కు చెందిన సునీతతో 2015లో వివాహమైంది. వీరికి ఒక పాప, బాబు సంతానం. కొంతకాలంగా వెంకట్రావ్‌పేటలో ఉంటున్నారు. రమేశ్ ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లొస్తున్నాడు. ఇటీవలే ఇంటికొచ్చిన అతనికి సునీత వివాహేతర సంబంధం పెట్టుకుందన్న అనుమానం కలిగింది. ఇదే విషయమై, అక్టోబర్ 30న గొడవపడ్డారు. రమేశ్ క్షణికావేశంలో సునీత ముఖంపై బలంగా కొట్టాడు. గొంతు నులిమి హతమార్చి, అక్కడి నుంచి పరారయ్యాడు. రెండు రోజుల తర్వాత నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.

- విలువలు మరిచి, అయినవారి ఆయువు తీస్తున్నారు..
- ఆస్తి పంపకాలు, కుటుంబ వివాదాలే కారణం
- అనుమానం, వివాహేతర సంబంధాలతో హత్యలు
- ఉమ్మడి జిల్లాలో ఆందోళనకర ఘటనలు

ఈ నెల 2న అర్థ రాత్రి వెల్గటూర్ మండలంలోని కుమ్మరిపల్లిలో బొమ్మల సుమన్(36)ను అతని తమ్ముడే దారుణంగా హత్య చేశాడు. భూమి విక్రయించగా వచ్చిన డబ్బులను తమ్ముడు ఢిల్లేశ్ సొంతానికి వాడుకున్నాడు. అడిగిన అన్నను స్నేహితుడితో కలిసి కడతేర్చాడు.



సుమన్ (ఫైల్)



సాక్షి, పెద్దపల్లి/జగిత్యాలక్రైం: అగ్ని సాక్షిగా చేసిన ప్రమాణాలు.. నూరేళ్ల కలిసి ఉంటామని చేసిన బాసలు అభాసుపాలవుతున్నాయి. భార్యాభర్తల జీవితం కొన్నేళ్లయినా సాఫీగా సాగడం లేదు. అనుమానాలు, వివాహేతర సంబంధాలు, చిన్నపాటి తగాదాలు పచ్చని కాపురాల్లో చిచ్చు పెడుతున్నాయి. క్షణికావేశం హత్యలకు దారి తీస్తోంది. పలుచోట్ల భార్యను భర్త చంపితే, మరికొన్నిచోట్ల భర్తను భార్య అంతమొందిస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇంకొన్ని చోట్ల ఆస్తి గొడవల్లో కుటుంబసభ్యులనే కడతేరుస్తున్నారు. ఇటువంటి సంఘటనలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనూ జరుగుతుండటం నేటి మానవ సంబంధాలపై ఆందోళనకు కారణమవుతున్నాయి.

మత్తు.. క్షణికావేశం

మద్యం మత్తు తల్లిదండ్రులు, పిల్లలు అన్న అనుబంధాన్ని మరచిపోయేలా చేస్తోంది. మత్తులో విచక్షణ కోల్పోయిన పలువురు దాడులు చేసుకుంటున్నారు. తేరుకున్నాక చూస్తే కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. ఒకరు చనిపోవడం, మరొకరు జైలుకు వెళ్తుండటంతో చిన్నారులు అనాథలుగా మిగులుతున్నారు. వ్యసనాలకు బానిసలవుతున్న పిల్లలు.. డబ్బులివ్వకపోతే తల్లిదండ్రులపై కక్ష పెంచుకుంటున్నారు. ఆస్తుల పంపకం విషయంలోనూ తమకు అన్యాయం జరిగిందనే భావనతో కొందరు కన్నవారిపై దాడులకు తెగబడుతున్నారు. గంజాయి, మద్యం అలవాటు ఉన్నవారు ఎక్కువగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలు బాధిత కుటుంబాలకు తీరని శోకాన్ని మిగులుస్తున్నాయి.

ఎన్నో కారణాలు..

ప్రస్తుతం మానవ సంబంధాలు బలహీనమవడానికి ఎన్నో కారణాలు ఉన్నాయని మానసిక నిపుణులు చెబుతున్నారు. తల్లితండ్రులు ఉద్యోగాలు చేస్తూ పిల్లలను పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడంతో సర్ధిచెప్పే పెద్దలు కరువయ్యారని, దంపతులు విడాకులు కావాలంటూ ఠాణాల మెట్లెక్కుతున్నారని పేర్కొంటున్నారు. వీరిలో ఎక్కువ మంది పెళ్లయిన ఏడాది నుంచి ఐదేళ్లలోపు వారే ఉంటున్నారని, గొడవ పడే దంపతుల మధ్య మూడో మనిషిగా సెల్‌ఫోన్లు చేరి, బంధాలను దూరం చేస్తున్నాయని అంటున్నారు.

చిన్నచిన్న గొడవలే..



జగిత్యాల జిల్లాలో హత్యలకు చిన్నచిన్న గొడవలే కారణమవుతున్నాయి. నేరస్తులతోపాటు హత్యకు ప్రోత్సహించిన వారిని టెక్నాలజీ సహాయంతో గుర్తించి, కఠినచర్యలు తీసుకుంటున్నాం. 1, 2 కేసులున్న వారిపై రౌడీషీట్, పీడీయాక్ట్ ఓపెన్ చేస్తున్నాం.

– ఎస్పీ అశోక్‌కుమార్, జగిత్యాల

నేరస్తులకు శిక్ష తప్పదు



కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, అక్రమ సంబంధాల వంటి కారణాలతో ఎక్కువగా దారుణాలు చోటుచేసుకుంటున్నాయి. ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నింపుతున్నాయి. నేరాల విషయంలో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. నేరస్తులకు శిక్ష తప్పదు.

– ఏసీపీ రమేశ్, రామగుండం

నమ్మకం లేకనే..



దంపతులకు ఒకరిపై ఒకరికి నమ్మకం లేకపోవడం అనేక అనర్థాలకు దారితీస్తోంది. జీవితాంతం కలిసి ఉండాల్సినవారు చంపుకుంటున్నారు. ఇద్దరి మధ్య దూరాన్ని పెంచుతున్న ఫోన్ల వాడకాన్ని తగ్గించుకోవవాలి. మనసువిప్పి, మాట్లాడుకుంటే అనుబంధాన్ని పెంచుకోవచ్చు.– **రవివర్మ, మానసిక వైద్య నిపుణులు, రామగుండం**

పరిసరాలు ఇలాగేనా ఉండేది..?



మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

- తహసీల్దార్, ఎంపీడీవో వచ్చి శుభ్రం చేస్తారా..?
- మోడల్ స్కూల్ ఉపాధ్యాయులపై కలెక్టర్ ఆగ్రహం

ఇబ్రహీంపట్నం: 'మోడల్ స్కూల్ ఉండేది ఇలాగేనా..? పరిసరాలు ఎక్కడ చూసినా చెత్తాచెదారం పేరుకుపోయింది. కనీసం శుభ్రం చేయకుంటే విద్యార్థుల పరిస్థితి ఏంటీ..' అంటూ కలెక్టర్ సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం కనిపించడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అటెండర్లు సరిగా లేరని ఉపాధ్యాయులు తెలపగా.. తహసీల్దార్, ఎంపీడీవోలు వచ్చి శుభ్రం చేస్తారా..? అంటూ మండిపడ్డారు. అవసరమైతే విద్యార్థులతో ఒక్కరోజు శ్రమదానం వంటి కార్యక్రమం చేపట్టి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రేకులషెడ్డులోనే వంట చేస్తున్నామని, గది నిర్మించాలని నిర్వాహకులు కోరగా.. అంచనాలు రూపొందించాలని ఎంపీడీవో చంద్రశేఖర్‌కు సూచించారు. ఈజీఎస్ నిధులు రూ.2.50లక్షలతో అంచనాలు తయారుచేశామని ఎంపీడీవో పేర్కొన్నారు. బాలికల హాస్టల్ సమీపంలో ఈద్గా ఉండడం.. హాస్టల్‌కు ఒకవైపే ప్రహరీ ఉండడంతో వెంటనే నిర్మాణం చేపట్టాలని ఆర్డీవో శ్రీనివాస్‌కు సూచించారు. హాస్టల్ గదుల వెంటిలేటర్లకు జాలీలు లేకపోవడంతో కోతులు చొరబడుతున్నాయని వార్డెన్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. జాలీలు బిగించాలని తహసీల్దార్ ప్రసాద్‌ను ఆదేశించారు. వర్షకొండలో నిర్మిస్తున్న హెల్త్ సబ్ సెంటర్‌ను పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఆయన వెంట డీఈవో రాము, స్కూల్ ప్రిన్సిపాల్ ప్రభాకర్, పంచాయతీ రాజ్ ఈఈ రెహమాన్, డీఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా జగిత్యాల



మహిళలకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: జగిత్యాలను త్వరితగతిన అభివృద్ధి చేస్తున్నామని, రూ.100 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్, రూ.5 కోట్లతో మహిళా డిగ్రీ కళాశాలను అభివృద్ధి చేస్తున్నామని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ప్రజావిజయోత్సవాల్లో భాగంగా మంగళవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహిళాశక్తి నుంచి మహిళలు రుణాలు తీసుకుని వ్యాపారాలు చేసి లాభాలు పొందాలన్నారు. చిరువ్యాపారులకు రూ.25లక్షలు మంజూరు కాగా చెక్కులు అందించామన్నారు. 13 మహిళా సంఘాలకు రూ.3.20 కోట్ల చెక్కులు అందించారు. కోల్డ్ స్టోరేజీ ఏర్పాటుకు రూ.9లక్షల ప్రొసీడింగ్ కాపీ ఇచ్చారు. పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్, టీఆర్‌నగర్‌లో రూ.5 కోట్లతో అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. మున్సిపల్ కార్మికులకు దుస్తులు, సబ్బులు, సేఫ్టీ కిట్స్ అందిస్తున్నట్లు వివరించారు. టీపీసీసీ స్పోక్స్ పర్సన్ శ్రీనివాస్‌తో కలిసి మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, గోలి శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గిరి నాగభూషణం, కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్లు రాంకుమార్, కప్పల శ్రీకాంత్, కృష్ణహరి, జగదీశ్, ధర్మరాజు, జయశ్రీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కోరుట్ల: పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. రూ.1.43కోట్లతో నిర్మించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అమృత్ పథకంలో భాగంగా రూ.43 కోట్లతో నిర్మించనున్న తాగునీటి సరఫరా పథకానికి భూమిపూజ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 110 మంది లబ్ధిదారులకు రూ.35,25,500 విలువైన చెక్కులు అందించారు. సీఎంకు వ్యవసాయమే తెలియదు

ఇబ్రహీంపట్నం: సీఎం రేవంత్‌రెడ్డికి వ్యవసాయం తెలియదని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. మండలంలోని వర్షకొండ శివారులో మిషన్‌భగీరథ పైప్‌లైన్ కోసం రాజ్యసభ సభ్యుడు సురేష్‌రెడ్డి నిధులు మంజూరు చేయగా.. భూమిపూజ చేశారు. 61మంది లబ్ధిదారులకు రూ.15.26లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు.

క్రీడాకారులందరినీ ఆహ్వానించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి

జగిత్యాల: సీఎం కప్ క్రీడాపోటీల్లో క్రీడాకారులు అత్యధికంగా పాల్గొనేలా చూడాలని అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి అన్నారు. మంగళవారం కమిషనర్లు, ఎంఈవోలు, క్రీడా అసోసియేషన్ అధ్యక్షులతో సమావేశమయ్యారు. క్రీడాకారుల బయోడేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, వారికి అన్నివిధాలా సహకరించాలని, ప్రతి క్రీడాఅంశంపై దిశానిర్దేశం చేయాలన్నారు. కార్యక్రమంలో క్రీడల అభివృద్ధి అధికారి కోరకంటి రవి పాల్గొన్నారు.

'యువ వికాసం' సభకు తరలిరండి



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: పట్టణంలోని చిరువ్యాపారులకు అండగా నిలిచేందుకు గతంలో తైబజార్ పన్ను మినహాయించి జగిత్యాల పట్టణాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిపామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా మంగళవారం విలేకరులతో మాట్లాడారు. చిరువ్యాపారులకు తైబజార్ చిట్టీ రద్దు చేసి ఉమ్మడి రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయం ఆలోచించి రాష్ట్రవ్యాప్తంగా తైబజార్ చిట్టి రద్దు చేయాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రేవంత్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని, యువత, రైతులకు పెద్దపీట వేస్తున్నారని పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా పెద్దపల్లిలో నిర్వహిస్తున్న యువవికాసం సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కొత్త మోహన్, తాటిపర్తి విజయలక్ష్మి, బండ శంకర్, గాజంగి నందయ్య, జున్ను రాజేందర్, గుండ మధు, మహేష్, నేహాల్, చాంద్‌పాషా తదితరులు ఉన్నారు.

విద్యార్థులు కష్టపడుతున్నందుకా విజయోత్సవాలు..?



సారంగాపూర్ కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

సారంగాపూర్: విద్యార్థులు వసతి గృహాల్లో ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం మరిచిపోయి విజయోత్సవ సంబరాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. మంగళవారం సారంగాపూర్ మండలకేంద్రంలోని కస్తూరిబా బాలికల విద్యాలయాన్ని ఆమె సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో 200 మంది విద్యార్థినులకు వసతి ఉండగా 300 మందిని ఉంచడంతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. విద్యార్థులకు సబ్బులు, శాంపులు ఇవ్వకపోవడంతో ఇంటి నుంచి తెచ్చుకుంటున్నామని చెబుతున్నారని, ఇన్ని సమస్యలు ఉన్నా ప్రభుత్వం సంబరాలు జరుపుకోవడం అవివేకమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తేలు రాజు, సింగిల్ విండో మాజీ చైర్మన్ సాగి సత్యం రావు, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అనంతుల గంగారెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు సిలివేరి మదన్, నాయకులు రవీందర్‌రెడ్డి, బైరి మల్లేశం, శ్రీను, ఫక్రోద్దీన్ పాల్గొన్నారు.

జిల్లాకు తేలికపాటి వర్ష సూచన

జగిత్యాలఅగ్రికల్చర్: రానున్న ఐదు రోజుల్లో జిల్లాలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పొలాస వ్యవసాయ పరిశోధనస్థానం డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 30 నుంచి 31 డిగ్రీల సెల్సియస్‌గా, రాత్రి ఉష్ణోగ్రత 21 నుంచి 22 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థిని



గంగోత్రిని అభినందిస్తున్న ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాలలోని మోడల్ స్కూల్ విద్యార్థిని భూక్య గంగోత్రి ఎస్జీఎఫ్ అండర్–19 విభాగంలో కబడ్డీ పోటీల్లో జాతీయస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బి.లావణ్య తెలిపారు. ఈనెల 7నుంచి 11 వరకు హర్యానాలో నిర్వహించనున్న పోటీలలో గంగోత్రి పాల్గొంటుందని పేర్కొన్నారు. గంగోత్రిని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు. చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేశ్ గంగోత్రికి రూ.ఐదువేలు అందించారు. కార్యక్రమంలో పీడీ అనూప్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీధర్, సత్యానందం, ఉపాధ్యాయయ బృందం ఉన్నారు.

ధరణి సమస్యలకు పరిష్కారమెప్పుడో.. ?

- కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- పెండింగ్‌లో 1,187 దరఖాస్తులు
- 'భూమాత' కోసం ఎదురుచూపులు

జగిత్యాల: బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌లో అనేక తప్పిదాలు దొర్లడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొందరి రైతుల నంబర్లు మిస్సింగ్ కావడంతోపాటు, భూములు ఎక్కువగా.. తక్కువగా నమోదు కావడం.. కొన్ని భూములు నాలా కిందకు వెళ్లడం వంటి సమస్యలు నెలకొన్నాయి. ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు కొన్ని మాడ్యూల్స్ ఇచ్చినప్పటికీ ఆశించిన రీతిలో ఫలితం కనిపించలేదు. రైతులు దరఖాస్తు చేసుకున్నా కొన్ని తిరస్కరణకు గురయ్యాయి. ఇలా జిల్లావ్యాప్తంగా సుమారు 1187 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. తాజాగా ధరణి బాధిత రైతులందరూ సమస్యల పరిష్కారానికి ఎదురుచూస్తున్నారు. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ధరణి పోర్టల్ ఎత్తివేసి దాని స్థానంలో భూమాత పోర్టల్ తీసుకొస్తామని ప్రకటించినా ఇప్పటివరకు అమలు కాకపోవడంతో రైతులు దానికోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ భూములకు అత్యధికంగా ధర పలకడంతో భూములు కొనుగోలు చేసేందుకు అనేకమంది ప్రయత్నాలు చేస్తున్నారు. విక్రయించే వారు సరైన నంబర్లు లేకపోవడం.. సరైన కొలతలు లేకపోవడంతో నానా ఇబ్బంది పడుతున్నారు. అటు భూములు అమ్మకపోవడం, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కూడా అమ్మే పరిస్థితి లేకుండాపోతోంది. మీసేవ కేంద్రాల్లో రైతులు ఫీజులు చెల్లించి దరఖాస్తు చేసుకున్నా అవి రిజెక్ట్ కావడంతో రైతులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ధరణి పోర్టల్‌ను గత ప్రభుత్వం 2020 అక్టోబర్ 2న అమల్లోకి తీసుకొచ్చిన విషయం తెల్సిందే. అందులో తప్పులు దొర్లడంతో పరిష్కారానికి కొన్ని మార్గాలు కల్పించింది. అలాంటి సమస్యలను మీసేవ కేంద్రం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే కలెక్టర్ పరిశీలించి పరిష్కరించాల్సి ఉంటుంది. కొన్ని అనివార్య కారణాలతో తిరస్కరించడంతో ఇబ్బందికరంగా మారింది. జిల్లా వ్యాప్తంగా నవంబర్ నెల వరకు 1187 పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా.. తహసీల్దార్ల లాగిన్‌లో 488, ఆర్డీవో లాగిన్‌లో 350, అదనపు కలెక్టర్ లాగిన్‌లో 133, కలెక్టర్ లాగిన్‌లో 218 వరకు దరఖాస్తులు ఉన్నట్లు తెలిసింది.



భూమాత పోర్టల్

పరిష్కారమెప్పుడో..?

భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా అప్పటి అధికారులు ఇష్టానుసారంగా ఆన్‌లైన్ చేయడంతో అనేక మంది రైతులకు సంబంధించిన భూములు తప్పిదాలు పడ్డాయి. నిత్యం రైతులు సమస్యలను పరిష్కరించాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అవి దాదాపు పరిష్కారం కావడం లేదు. కొన్ని పూర్తిస్థాయిలో కరెక్ట్ ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఎల్ఆర్ యూపీ వెబ్‌సైట్ రద్దు చేసి ధరణి వెబ్‌సైట్‌ను తీసుకువచ్చారు. అప్పటి నుంచి తహసీల్దార్లు పరిష్కరించే సమస్యలన్నీ కలెక్టర్ చేతుల్లోకి వెళ్లాయి. కానీ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు.

'భూమాత' వచ్చేదెప్పుడు..!

ధరణి పోర్టల్‌లో ఉన్న నిబంధనలతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని ప్రకటించింది. సీఎం రేవంత్‌రెడ్డి ధరణి స్థానంలో భూమాత పోర్టల్ తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. అది ఇప్పటి వరకు అమలులోకి రావడం లేదు. కానీ రైతుల భూ సమస్యల కోసం కార్యాలయాల వద్దకు వెళ్తే భూమాత పోర్టల్ వస్తుందని, త్వరగా సమస్యలు పరిష్కారమవుతాయని చెబుతూ రైతులను తిప్పి పంపిస్తున్నారు. ఇప్పటికే అటు పట్టాదారుపాస్‌బుక్‌లు రాక రైతులకు బ్యాంక్ రుణాలు, రుణమాఫీ ఇతర ప్రయోజనాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూమాత కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

క్లుప్తంగా

బీరు సీసాల్లో ఫంగస్



ఫంగస్ ఉన్న బీరు సీసాలు

మల్లాపూర్(కోరుట్ల): ఓ బెల్ట్‌షాపులో కొనుగోలు చేసిన బీరుసీసాల్లో ఫంగస్ కనిపించింది. కొనుగోలుదారుల వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన కొంతమంది వ్యక్తులు మంగళవారం మెట్‌పల్లి వెళ్తున్నారు. మార్గమధ్యలో మల్లాపూర్ మండలంలోని ఒబులాపూర్ బెల్ట్‌షాప్‌లో బీర్లు తీసుకున్నారు. రెండు సీసాల్లో ఫంగస్ కనిపించింది. దీనిపై బెల్ట్‌షాప్ నిర్వాహకులను ప్రశ్నించగా, నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారన్నారు. అధికారులు స్పందించి, నాణ్యత లేని మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌షాప్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



బీరువాను చూపుతున్న బాధితులు

రామగిరి(మంథని): తాళం వేసిన ఇంట్లో దుండగులు చొరబడి, ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల వివరాల ప్రకారం.. రామగిరి మండలంలోని నాగెపల్లికి చెందిన వావిలాల రాజేందర్ మణుగూరు మైన్స్‌లో ఈపీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. నాగెపల్లిలో ఉంటున్న ఆయన భార్య సాధన కుటుంబసభ్యులతో కలిసి గత నెల 30న గోదావరిఖనిలోని తల్లిగారింటికి వెళ్లింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి రాగా, ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లిచూడగా బీరువాలోని తులం బంగారం, రూ.20 వేల విలువైన వెండి ఆభరణాలు, రూ.30 వేలు కనిపించలేదు. చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని, భర్త రాజేందర్‌కు సమాచారం ఇచ్చింది. ఎస్సై చంద్రకుమార్‌ను వివరణ కోరగా నాగెపల్లిలో చోరీ జరిగినట్లు తమకు ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

గల్ఫ్ ఏజెంట్ అరెస్టు

ముస్తాబాద్ (సిరిసిల్ల): నిరుద్యోగుల బలహీనతలను ఆసరాగా తీసుకొని గల్ఫ్ దేశాలకు పంపిస్తానంటూ మోసం చేసిన ఓ గల్ఫ్ ఏజెంట్‌ను మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్సై గణేశ్ తెలిపారు. వేములవాడ మండలం నెమలి గుండుపల్లి గ్రామానికి చెందిన చద్రగిరి రాహుల్ గతంలో బహిరిన్ దేశానికి వెళ్లి వచ్చాడన్నారు. ముస్తాబాద్ మండలం పోతుగల్, వేములవాడ మండలాల్లో 20 మందిని గల్ఫ్ దేశం పంపిస్తానని డబ్బులు తీసుకున్నట్లు తెలిపారు. అలాగే పలు బ్యాంకుల్లో రుణాలు ఇప్పిస్తానంటూ అందిన కాడికి దండుకున్నాడన్నారు. మోసాన్ని గ్రహించిన బాధితులు ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

బైకులకు నిప్పంటించిన వ్యక్తి రిమాండ్

సిరిసిల్ల క్రైం: పట్టణంలోని నాలుగు ద్విచక్ర వాహనాలకు నిప్పంటించిన వ్యక్తిని రిమాండ్ పంపినట్లు సిరిసిల్ల సీఐ కృష్ణ తెలిపారు. సోమవారం పట్టణంలోని పెద్దూరు పరిధిలోని డబుల్ బెడ్ రూం గృహాల సముదాయంలో పార్కింగ్ చేసిన బైక్‌లను పెట్రోల్ పోసి గుర్తు తెలియని వ్యక్తులు కాల్చినట్లు అంకం సందీప్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు చేసిన పోలీసులు సీసీ కెమెరాలు ఆధారంగా అదే ప్రాంతానికి చెందిన ఆకారం బాలయ్య అనే వ్యక్తిగా గుర్తించారు. కేసు నమోదు చేసి రిమాండ్ తరలించారు.

ఇసుకలో కూరుకుపోయి..

- జీడీకే-7 ఎల్ఈపీ గని ఇన్‌చార్జి మేనేజర్ మృతి
- సేఫ్టీ బెల్ట్ పెట్టుకోకపోవడం వల్లే?
- జనరల్ మజ్దూర్‌కు తృటిలో తప్పిన ప్రమాదం



సత్యనారాయణ మృతదేహం



బంకర్ వద్ద రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్న సిబ్బంది

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-2 పరిధిలోని జీడీకే-7 ఎల్ఈపీ గని స్టవింగ్ బంకర్‌లో పడి ఇన్‌చార్జి మేనేజర్ తీట్ల సత్యనారాయణ(44) మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. బసంత్‌నగర్‌లోని రాంనగర్‌కు చెందిన సత్యనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆయన కుటుంబసభ్యులతో కలిసి యైటింక్లయిన్ కాలనీలో ఉంటున్నారు. స్టవింగ్ బంకర్‌లో మల్మా పేరుకుపోవడంతో మంగళవారం జనరల్ మజ్దూర్ కార్మికుడు క్రాంతికుమార్ సేఫ్టీ బెల్ట్‌తో బంకర్‌లోకి దిగి, తొలగిస్తున్నాడు. ఈ పనులను అక్కడే ఉండి, పర్యవేక్షిస్తున్న సత్యనారాయణ ప్రమాదవశాత్తు అందులో పడ్డాడు. ఇసుకలో కూరుకుపోయి, ఊపిరాడక మృతిచెందాడు. క్రాంతికుమార్‌ను రెస్క్యూ సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. 4 గంటలపాటు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి, సత్యనారాయణ మృతదేహాన్ని వెలికితీశారు. సేఫ్టీ బెల్ట్ పెట్టుకుంటే ఆయన ప్రాణాలు దక్కేవని కార్మికులు అంటున్నారు.

డీడీఎంఎస్ ఆదేశాలతో..

మూసివేసిన జీడీకే-7 ఎల్ఈపీ గనిలో కొన్ని ఫిల్లర్ల ప్రాంతంలో ఇసుకను నింపాలని డీడీఎంఎస్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. గనిలోని 182వ ఫిల్లర్ వద్ద బొగ్గును వెలికితీసి, ఇసుక నింపలేదని గుర్తించారు. భవిష్యత్ రక్షణను దృష్టిలో పెట్టుకొని, ఖాళీగా ఉన్న ప్రాంతాలను స్టవింగ్ చేయాలని సూచించారు. దీంతో వారం రోజులుగా సంబంధిత పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

మృతుని కుటుంబంలో ఒకరికి సూటబుల్ జాబ్ ఇచ్చేందుకు అంగీకారం..

ఇన్‌చార్జి మేనేజర్ సత్యనారాయణ కుటుంబంలో ఒకరికి సూటబుల్ జాబ్ ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఏరియా ఆస్పత్రికి చేరుకొని, సత్యనారాయణ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబసభ్యులను ఓదార్చారు. ఈ మేరకు జాబ్ ఇచ్చేందుకు అధికారులు అంగీకరించారు.

గతంలో ఇలాంటి సంఘటన..

2008లో ఇదే ఏరియాలో జీడీకే-8 గనికి చెందిన రమణారెడ్డి అనే కార్మికుడు సాండ్ బంకర్ వద్ద ఇసుకను తొలగిస్తూ అందులోనే పడి మృతిచెందాడు. ఇసుక బంకర్ల వద్ద పనిచేసే సమయంలో ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవాలనే అంశంపై సింగరేణి యాజమాన్యం దిశానిర్దేశం చేయలేదా? ఒకవేళ చేసి ఉంటే ఎందుకు అమలు చేయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

భవిష్యత్తులో జరగకుండా చూడాలి

ఆర్జీ-2 ఏరియా ఇన్‌చార్జి మేనేజర్ సత్యనారాయణ మృతి బాధాకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్న. బాధిత కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్న. యాజమాన్యం భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

– ఎంపీ గడ్డం వంశీ, పెద్దపల్లి

రక్షణ చర్యల్లో నిర్లక్ష్యం

రక్షణ చర్యల్లో యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. సరైన రక్షణ చర్యలు చేపడితే సత్యనారాయణ మృతిచెందేవారు కాదు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలి. మృతుని కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి.

– ఎమ్మెల్యే ఎంఎస్.రాజ్‌ఠాకూర్, రామగుండం

అన్నను కిరాతకంగా చంపిన తమ్ముడు

- డబ్బు విషయంలో గొడవలే కారణం
- కుమ్మరిపల్లిలో ఘటన



సుమన్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

వెల్గటూర్ (ధర్మపురి): డబ్బు విషయమై గొడవల నేపథ్యంలో పేగు బంధాన్ని మరిచిన ఓ యువకుడు తోడబుట్టిన అన్ననే కిరాతకంగా చంపాడు. ఈ ఘటన వెల్గటూర్ మండలంలోని కుమ్మరిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కుమ్మరిపల్లికి చెందిన బొమ్మెల సుమన్(34), ఢిల్లేశ్ అన్నదమ్ములు. వీరి తల్లి భారతమ్మకు ఆమె తల్లి నుంచి వారసత్వంగా వచ్చిన 32 గుంటల వ్యవసాయ భూమి ఉంది. 2 నెలల క్రితం ఆ భూమిని విక్రయించగా.. కొనుగోలు చేసినవారు రూ.2.60 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చారు. ఆ డబ్బులను ఢిల్లేశ్ సొంతానికి వాడుకున్నాడు. తన వాటాగా రావాల్సిన డబ్బులు ఇవ్వమని అడిగినందుకు అన్న సుమన్‌పై 20 రోజుల క్రితం దాడి చేశాడు. అప్పటినుంచి అన్నదమ్ముల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అన్న బతికుంటే ఎప్పటికైనా డబ్బులు ఇవ్వాల్సి వస్తుందని ఢిల్లేశ్ భావించాడు. అతన్ని చంపితే మొత్తం డబ్బులు వస్తాయన్న దురాలోచనతో తన స్నేహితుడు పోతునక సురేందర్‌తో కలిసి అన్న హత్యకు పథకం వేశాడు. మద్యం మత్తులో ఉన్న సుమన్ సోమవారం అర్ధరాత్రి బయటకు రావడంతో కత్తితో విచక్షణారహితంగా పొడిచి, హత్య చేశాడు. మంగళవారం ఉదయం మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రాంనర్సింహారెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించి, వివరాలు సేకరించారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. కాగా, మృతుడికి ఒక పాప ఉంది.

థాయిలాండ్‌లో ఇద్దరి అదృశ్యం

- ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన కుటుంబసభ్యులు



అరవింద్



సాగర్



ఫిర్యాదు చేస్తున్న కుటుంబసభ్యులు

జగిత్యాల క్రైం: ఉన్న ఊరిలో ఉపాధి లేక థాయిలాండ్ దేశానికి ఉపాధి కోసం వెళ్లి జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మోహన్‌రావుపేటకు చెందిన శనిగారపు అరవింద్, నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం చెట్‌పల్లికి చెందిన కోంద్ర సాగర్ అక్కడే అదృశ్యమయ్యారు. వారి ఆచూకీ తెలపాలని కోరుతూ అరవింద్ భార్య జల, సాగర్ భార్య కాశమ్మ మంగళవారం హైదరాబాద్‌లోని ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అరవింద్, సాగర్ జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌కు చెందిన రాజు అనే ఏజెంట్‌కు రూ.2లక్షల చొప్పున చెల్లించి విజిట్ వీసాపై నవంబర్ 11న థాయిలాండ్ వెళ్లారు. నవంబర్ 21 నుంచి వారి కుటుంబ సభ్యులతో అందుబాటులో ఉన్నారు. ఆ తర్వాత నుంచి వారి నుంచి సమాచారం లేకపోవడం.. ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలి యక కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ నాయకుడు డాక్టర్ బీఎం.వినోద్‌కుమార్, మంద భీంరెడ్డి, చెన్నమనేని శ్రీనివాస్‌రావుతో కలిసి హైదరాబాద్‌లోని ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. థాయిలాండ్‌లో తప్పిపోయిన ఇద్దరి ఆచూకీ తెలుసుకోవాలని, వారిని థాయిలాండ్ పంపిన ఏజెంట్‌పై పోలీసులు కేసు నమోదు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

ఆటోల బంద్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న రవికుమార్

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 7న ఆటోల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ తెలిపారు. మంగళవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, వారి కుటుంబాలకు భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రూ.1,000 కోట్లతో ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రతీ ఆటోడ్రైవర్‌కు నెలకు రూ.12 వేలు ఇవ్వాలని కోరారు. ఆత్మహత్య చేసుకున్న 65 మంది ఆటోడ్రైవర్ల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. బంద్‌ను ఆటోడ్రైవర్లందరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, కరీంనగర్ నగర అధ్యక్షుడు మద్దెల రాజేందర్, నాయకులు బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి, బండారి సంపత్, మద్దుల రామ్ గోపాల్ రెడ్డి, పోతు చంద్రశేఖర్, సాల్లేటి ఆంజనేయులు, కొడుముంజ తిరుపతి, మఠం సాగర్ తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగావకాశాలు

సిరిసిల్ల: తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ పరిధిలోని రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్ కామ్) ద్వారా 20 దేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. యూకే, యూఎస్ఏ, జర్మనీ, జపాన్, ఇజ్రాయెల్, గ్రీస్, యూఏఈ తదితర దేశాల్లో వివిధ సెక్టార్లలోని పోస్టులను భర్తీ చేయనున్న ట్లు పేర్కొన్నారు. టామ్‌కామ్ ద్వారా రిజిస్టర్డ్ నర్స్, వృద్ధుల సంరక్షణ నర్స్, హెల్త్ కేర్ అసిస్టెంట్, ఆటోమోటివ్ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్, హెవీ మోటా ర్ వెహికల్ డ్రైవర్, ఫుడ్ డెలివరీ సిబ్బంది, కార్పెంటర్లు, హాస్పిటాలిటీ (హౌస్ కీపింగ్, వెయిటర్లు, కిచెన్ స్టాఫ్, గార్డెనర్), భవన నిర్మాణ రంగాల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులకు ఆయా దేశాల భాషలు నేర్పించడంతోపాటు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ, జీఎన్ఎం, నర్సింగ్ వంటి అర్హతలున్న 18–45 ఏళ్ల వయసువారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు టామ్‌కామ్ 94400 51452/94400 49861/99519 09863 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



సాగర్ (ఫైల్)

కరీంనగర్‌రూరల్: రాజీవ్ రహదారిలో మొగ్దుంపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మంచిర్యాలకు చెందిన ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పారుపల్లికి చెందిన బోగె రాజేశ్వరి–బాబు దంపతులకు ఇద్దరు కుమార్తెలతోపాటు కుమారుడు సాగర్(20) సంతానం. సాగర్ మంచిర్యాలలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం దండేపల్లి మండలం కన్నెపల్లికి చెందిన స్నేహితుడైన రాగుల శ్రీనివాస్‌తో కలిసి సాగర్ పల్సర్ బైక్‌పై చల్మెడ ఆనందరావు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మిత్రుడిని చూసేందుకు పెద్దపల్లి మీదుగా రాజీవ్ రహదారిలో వస్తున్నాడు. మార్గమధ్యంలో మధ్యాహ్నం 3 గంటల సమయంలో మొగ్దుంపూర్ జెడ్పీ పాఠశాల సమీపంలో ఓ లారీ యూటర్న్ చేస్తుండగా.. వెనకనుంచి వస్తున్న బైక్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాగర్ అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తీసుకెళ్లారు. సాగర్ తండ్రి బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం.. ఇద్దరి అరెస్టు

వేములవాడరూరల్: ఉద్యోగం ఇప్పిస్తామంటూ ఓ వ్యక్తి వద్ద డబ్బులు తీసుకొని, మోసం చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గంగాధర మండలంలోని ఉప్పర మల్యాలకు చెందిన బందరకంటి తిరుపతి, మంచిర్యాలలోని వికాస్‌నగర్‌కు చెందిన గుమ్మా జగన్నాథరావు, హైదరాబాద్‌కు చెందిన పవన్‌రాజ్ వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లికి చెందిన ఎడపల్లి స్వామికి ఉద్యోగం ఇప్పిస్తామన్నారు. అతన్ని నమ్మించి, రూ.7,80,000 తీసుకొని, మోసం చేశారు. నిందితుల్లో ఇద్దరిని మంగళవారం అరెస్టు చేశామని, పవన్‌రాజ్ పరారీలో ఉన్నాడని సీఐ పేర్కొన్నారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని, భూమి తదితర విషయాల్లో మోసాలకు పాల్పడితే బాధితులు నేరుగా పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామ శివారు మానేరు వాగునుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. మండెపల్లికి చెందిన గుర్రం శ్రీకాంత్, తంగళ్లపల్లికి చెందిన సూర దేవరాజు ఇసుకను తరలిస్తుండగా వారిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కానిస్టేబుళ్లు శ్రీకాంత్, నరేందర్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు



గాయపడిన ప్రవీణ్

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలంలోని బండపల్లి గ్రామ శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన దర్శనాల రామస్వామి, భుక్య ప్రవీణ్, ఆజ్మీరా తిరుపతి బైక్‌పై వేములవాడకు వెళ్లి తిరిగొస్తుండగా బండపల్లి శివారులో బైక్, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రామస్వామి పరిస్థితి విషమంగా ఉండగా ప్రవీణ్, తిరుపతి తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం వీరిని 108 అంబులెన్స్‌లో వేములవాడకు తరలించారు. ప్రమాదానికి కారు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని గ్రామస్తులు తెలిపారు. కారును వేములవాడ పట్టణ శివారులో పట్టుకున్నట్లు తెలిసింది.

గంజాయి విక్రేతల అరెస్టు



అరెస్టు చూపుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల క్రైం: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేశామని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. జగిత్యాల రూరల్ మండలంలోని హైదర్‌పల్లి శివారులో జగిత్యాల రూరల్ పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో సారంగాపూర్ మండలంలోని నాగునూర్–లచ్చక్కపేటకు చెందిన విలాసాగరం ఆదిత్యానంద్ బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించాడు. అతన్ని ఆపి, తనిఖీ చేయగా 1.60 కిలోల గంజాయి లభ్యమైంది. పోలీసులు గంజాయిని, వాహనాన్ని స్వాధీనం చేసుకొని, ఆదిత్యానంద్‌ను అరెస్టు చేశారని డీఎస్పీ పేర్కొన్నారు. మరో ముగ్గురు నాగునూర్‌కు చెందిన బొడ్డుపల్లి రితిక్, ఇంద్రవెల్లికి చెందిన నగేశ్, హస్నాబాద్‌కు చెందిన గణేశ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. గంజాయి రవాణాదారులు, విక్రేతలపై నిఘా ఉంచామని, ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సాయంత్రం వాహనాల తనిఖీ చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సదాకర్ పాల్గొన్నారు.

పట్టణ శివారులో ముగ్గురు..

జగిత్యాల పట్టణ శివారు ధర్మపురి రోడ్‌లోని రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద మంగళవారం ముగ్గురు గంజాయి విక్రేతలను అరెస్టు చేసినట్లు ఎస్సై కిరణ్ తెలిపారు. వాహనాల తనిఖీ చేపడుతుండగా జగిత్యాల రూరల్ మండలంలోని గుల్లపేటకు చెందిన చింతకింది రంజిత్, పట్టణంలోని సుతారిపేటకు చెందిన పంచర్ల సాయిచరణ్, పంచర్ల సందీప్‌లు బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించారన్నారు. వారిని తనిఖీ చేయగా 204 గ్రాముల గంజాయి లభ్యమైందని పేర్కొన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకొని, ముగ్గురినీ అరెస్టు చేసినట్లు తెలిపారు.

కొండగట్టులో సినీ హీరో వరుణ్ తేజ్ పూజలు



స్వామివారి తీర్థప్రసాదం తీసుకుంటున్న హీరో వరుణ్ తేజ్

కొండగట్టు(మల్యాల): జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న ఆలయంలో సినీ హీరో వరుణ్ తేజ్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం శాలువాతో సత్కరించి, స్వామి వారి ప్రతిమ, తీర్థ ప్రసాదాలు అందించారు. కొండగట్టు ఆలయ ప్రాముఖ్యత, అంతరాలయం విగ్రహ విశిష్టతను వరుణ్ తేజ్ కు వివరించారు. మొదటిసారి హనుమాన్ దీక్ష తీసుకున్న తాను అంజన్న దర్శనానికి వచ్చానని, అంజన్న చాలా పవర్ ఫుల్ దేవుడని వరుణ్‌తేజ్ అన్నారు. అంజన్న దయతో రెండు రాష్ట్రాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నారు. సీఐ నీలం రవి ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు. ఆలయ ఈవో రామకృష్ణారావు, ఉప ప్రధాన అర్చకుడు చిరంజీవి స్థానాచార్యుడు కపీందర్ పాల్గొన్నారు.

మృతదేహం కోసం ఎదురుచూపు

- ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన రాణాపూర్‌వాసి మల్లయ్య
- విషమిచ్చి చంపారని హైకోర్టులో భార్య పిటిషన్



మల్లయ్య (ఫైల్)

పాలకుర్తి(రామగుండం): ములుగు జిల్లా ఏటూరునాగారంలో ఆదివారం తెల్ల వారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాలకుర్తి మండలంలోని రాణాపూర్‌వాసి ఏగోళపు మల్లయ్య అలియాస్ మధు మృతిచెందిన విషయం విదితమే. ఆయన మృతదేహం కోసం కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు. కాగా, అది బూటకపు ఎన్‌కౌంటర్ అని, పోలీసులే విషమిచ్చి, తర్వాత కాల్చి చంపారని మృతుడి భార్య మీనా ఆరోపిస్తోంది. తన భర్త మృతదేహానికి రీపోస్టుమార్టం జరిపించాలని కోరుతూ సోమవారం హైకోర్టులో పిటిషన్ వేసింది. మంగళవారం విచారణకు రాగా, న్యాయమూర్తి గురువారానికి వాయిదా వేశారు. ఎవరి సమక్షంలో రీపోస్టుమార్టం నిర్వహించాలనే విషయాన్ని వెల్లడిస్తామని, అప్పటివరకు మృతదేహాన్ని ప్రభుత్వం ఆధ్వర్యంలో భద్రపరచాలని కోర్టు ఆదేశించినట్లు మల్లయ్య కుటుంబసభ్యులు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున మల్లయ్య మృతదేహం కోసం ఆయన సోదరులు, పలువురు గ్రామస్తులు ఏటూరునాగారం వెళ్లారు. కేసు వాయిదా పడటంతో మంగళవారం తిరిగి స్వగ్రామం చేరుకున్నారు. కోర్టు తీర్పు వచ్చాక మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు వెళ్తామని తెలిపారు.

సిరిసిల్లలో సైలెన్సర్లు ధ్వంసం

- అధిక శబ్దంతో వెళ్లే బైక్‌లను సీజ్ చేస్తాం
- ఎస్పీ అఖిల్ మహాజన్




సైలెన్సర్లు ధ్వంసం చేయిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం: అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను అమర్చితే సంబంధిత బైక్‌లను సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో అధిక శబ్దంతో వెళ్తున్న 72 బైక్‌లను, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన 3 పోలీస్ సైరన్‌లను ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం వాటిని సిరిసిల్ల అంబేడ్కర్ చౌరస్తాలో రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేశారు. శబ్ద కాలుష్య నియంత్రణతోపాటు ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని, విస్తృత తనిఖీలు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇప్పటికే 10 మందిపై కేసులు నమోదు చేసి, వారి వాహనాలను సీజ్ చేశామని పేర్కొన్నారు. అధిక శబ్దం ఇచ్చే సైలెన్సర్ ఉన్న వాహనాలను గుర్తిస్తే సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్సై 87126 56441, వేములవాడ ట్రాఫిక్ ఎస్సై 87126 56440 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ కృష్ణ, ట్రాఫిక్ ఎస్సై రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల పేరిట సైబర్ మోసం

- రూ.90 వేలు పోగొట్టుకున్న ఫర్టిలైజర్ వ్యాపారి



ఫోన్‌పే ద్వారా పంపిన డబ్బులు

వెల్గటూర్ (ధర్మపురి): పోలీసుల పేరిట వచ్చిన ఫోన్ కాల్‌కు స్పందించిన ఓ వ్యక్తి రూ.90 వేలు పోగొట్టుకున్నాడు. బాధితుడి వివరాల ప్రకారం.. వెల్గటూర్ మండలానికి బండారి తిరుపతి మండల కేంద్రంలో ఫర్టిలైజర్ షాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం పోలీసుల పేరిట అతనికి ఫోన్ కాల్ వచ్చింది. ఎస్సై బంధువులకు ఆరోగ్యం బాగాలేక హాస్పిటల్లో ఉన్నారని అవతలి వ్యక్తులు తెలిపారు. నీకు నగదు ఇస్తాం అర్జెంటుగా డబ్బులు పంపించాలంటూ స్కానర్ పంపించారు. తిరుపతి తన స్నేహితుడి ఖాతా నుంచి రూ.90 వేలు ఫోన్‌పే చేయించాడు. తర్వాత డబ్బుల కోసం ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చింది. మోసపోయామని గ్రహించిన బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఎండపల్లి మండలంలోని రాజారాంపల్లిలో ఇటీవలే ఓ వ్యక్తి సైబర్ మోసానికి గురై, రూ.60 వేలు పోగొట్టుకున్నాడు.





రాజన్న సన్నిధి.. భక్తజన పెన్నిధి

వేములవాడ: ఎములాడ రాజన్నను మంగళవారం దాదాపు 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కార్తీకమాసం ముగిసినప్పటికీ రద్దీ కొనసాగుతోంది. ధర్మగుండంలో పుణ్యస్నానాలు చేసినవారు స్వామివారికి అభిషేకాలు, అన్నపూజలు, సత్యనారాయణ వ్రతం చేశారు. కోడె మొక్కులు, నిలువెత్తు బెల్లం, అమ్మవారికి కుంకుమ పూజ మొక్కులు చెల్లించుకున్నారు. ఏర్పాట్లను ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవో శ్రవణ్, పర్యవేక్షకులు పరిశీలించారు. పోలీసులు, ఎస్పీఎఫ్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

స్వామివారిని దర్శించుకున్న విదేశీ మహిళ

రాజన్నను మంగళవారం ఓ విదేశీ మహిళ తన కూతురితో కలిసి దర్శించుకుంది. క్యూలైన్‌లో వెళ్లి, స్వామివారికి అభిషేకం జరిపించింది. ఆలయ అధికారులు ఆమెకు స్వామివారి ప్రత్యేకతను తెలియజేశారు.